క్లుప్తంగా

సాయి మందిరంలో శివసప్తాహం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): లెనిన్ సెంటర్‌లోని ఓం శ్రీ షిర్డీ నాగసాయిబాబా–నాగ మానసాదేవి మందిరంలో ఆదివారం శివసప్తాహం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో మహాశివుడు, గణపతి, మహానంది మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించారు. విగ్రహాలకు ఈనెల నాలుగో తేదీ నుంచి నిత్య పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం ఆరుద్ర నక్షత్రం కావడంతో మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో 108 లీటర్ల ఆవుపాలతో శివలింగాన్ని అభిషేకించారు. భక్తులు అన్నాభిషేకం, లక్షలాది పూలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మట్టి విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

అంకమ్మతల్లికి విశేష పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీ కాలనీలోని శ్రీ అంకమ్మతల్లి శక్తి పీఠంలో ఆదివారం విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. పీఠం వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబందీరావు అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, శ్రీచక్రార్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

బాబా మందిరంలో ఆదిశంకరాచార్య జయంతి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో ఆదివారం సాయంత్రం ఆలయ కమిటీ ఆధ్వర్యాన ఆదిశంకరాచార్య జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదిశంకరాచార్యులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్ ఆదిశంకరాచార్య జీవిత వృత్తాంతం, హిందూ మత పరిరక్షణకు ఆయన చేసిన సేవలను వివరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆదిశంకరాచార్య జయంతి వేడుకల్లో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నిరుపేదలకు అన్నదానం



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):కళ్లే లలితా ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సింగ్‌నగర్ రైతుబజార్ వద్ద నిరుపేద ప్రజలకు ఆదివారం అన్నదాన కార్యక్రమం జరిగింది. ట్రస్ట్ డైరెక్టర్ కళ్లే సీతా మహాలక్ష్మి పాల్గొని ముందుగా కళ్లే లలిత విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ట్రస్ట్ అధ్యక్షుడు కళ్లే నాగేశ్వరరావు మాట్లాడుతూ తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేదలకు ఆర్థిక సాయం, తోపుడు బండ్ల పంపిణీ, ఏసీ బాక్సులు, ప్రభుత్వ కార్యాలయాలకు కూలింగ్ వాటర్ మిషన్లు, పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలు, నిత్యావసర సరుకుల పంపిణీ వంటి అనేక కార్యక్రమాలు చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ముప్పూరి హరీష్, ఎమ్.జశ్విన్, జి.ధృవన్, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

సెంట్రల్‌లో పోలింగ్‌కు సర్వం సిద్ధం

- సెంట్రల్ బరిలో 20 మంది అభ్యర్థులు
- మొత్తం ఓటర్లు: 2,77,724
- మొత్తం పోలింగ్ స్టేషన్లు: 267
- ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు: 4

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. నియోజకవర్గం ఆవిర్భవించిన తర్వాత నాలుగో దఫా ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో మొత్తం 2,77,724 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వీరిలో పురుషులు 1,34,829 మంది కాగా 1,42,845 మంది స్త్రీలు ఉన్నారు. ఇతరులు 50 మంది ఉన్నారు. కొత్తగా ఓటు హక్కు పొందిన 6,825 మంది యువత తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. నియోజకవర్గంలో మొత్తం 267 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం పోలింగ్ నిర్వహించనున్నారు. గతంలో 257 పోలింగ్ కేంద్రాలు మాత్రమే ఉన్నాయి. ఓటర్ల సంఖ్య ఆధారంగా కొత్తగా 10 ఆగ్జిలరీ పోలింగ్ స్టేషన్‌లు ఏర్పాటు చేశారు. దీంతో వీటి సంఖ్య 267కు చేరుకుంది. నియోజవకర్గంలో మొత్తం 1,888 మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు. వీరిలో పీఓలు 317 మంది, ఏపీఓలు 324 మంది, 1,247 మంది ఓపీఓలు విధులు నిర్వహించనున్నారు. ఆదివారం పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. సెంట్రల్ నియోజకవర్గానికి సంబంధించి ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్‌లో సిబ్బందికి పోలింగ్ మెటీరియల్ అందజేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల్లో సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు చేర్చారు. నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 642 బ్యాలెట్ యూనిట్లు, 321 కంట్రోల్ యూనిట్లు, 346 వీవీ ప్యాట్లు కేటాయించారు.



ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సెంట్రల్ నియోజకవర్గానికి చెందిన ఎన్నికల సిబ్బంది



సూర్యారావుపేట రైల్వే ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన హరిత పోలింగ్ బూత్

మోడల్ పోలింగ్ స్టేషన్లు..

ఈ ఎన్నికల్లో వినూత్నంగా మోడల్ పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఓటర్లను ఆకర్షించేందుకు హరిత(గ్రీన్), యువ, పింక్, విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిని అత్యంత ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ఈ కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.


బరిలో 20 మంది అభ్యర్థులు..

ఈ దఫా ఎన్నికల్లో సెంట్రల్‌లో మొత్తం 20 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరిలో ప్రధాన పార్టీలైన వైఎస్సార్ సీపీ, టీడీపీ, సీపీఎం, బీఎస్పీ అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వీరికి తోడు రిజిస్టర్డ్ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు మరో 16 మంది ఎన్నికల బరిలో నిలిచారు. ఒక్కో ఈవీఎంలో 15 గుర్తులు, నోటా బటన్ మాత్రమే ఉంటాయి. ఈ సారి 20 మంది అభ్యర్థులు రంగంలో ఉండటంతో రెండేసీ ఈవీఎంలు ఏర్పాటు చేశారు.

అభివృద్ధికి కేరాఫ్ 30వ డివిజన్

- రూ. 80 లక్షలతో పట్టణ ఆరోగ్యకేంద్రం
- రూ. 22 కోట్లతో డివిజన్‌లో రోడ్ల నిర్మాణం
- ఐదేళ్లలో అభివృద్ధి పరుగులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఒకప్పుడు గతుకుల మట్టి రోడ్లు, తుప్పలతో అధ్వానంగా పరిసరాలు, చీకటి పడితే అంధకారంతో ఉండే 30వ డివిజన్‌లోని గద్దే వెంకట్రామయ్యనగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయక నగర్‌లు వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రాంత రూపు రేఖలు మారిపోయాయి. అద్దాల వంటి రోడ్లు, ప్రతీ వీధిలోను విద్యుత్ దీపాలు, మురుగుకాలువలతో ఈ ప్రాంతం అభివృద్ధి పథంలో పరుగులు పెడుతోంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న డివిజన్‌లో ప్రజల అవసరాల మేరకు మెయిన్ రోడ్డును విస్తరణ చేశారు. అలాగే ప్రజలకు వైద్య సేవలు అందించేందుకుగానూ రూ. 80 లక్షలతో దేవీనగర్‌లో ముఖ్యమంత్రి పట్టణ ఆరోగ్య కేంద్రం నిర్మించి పేదలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారు. ఒకప్పుడు గర్భిణులు, బాలింతలు వ్యాక్సిన్ చెకప్‌ల కోసం మధురానగర్, అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు డివిజన్‌లో అన్ని వైద్యసేవలు ఉచితంగా అందజేస్తున్నారు. అలాగే అమృత్ పథకంలో భాగంగా ఇక్కడ యూజీడీ పంపింగ్ స్టేషన్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. డివిజన్ వాసులకు కృష్ణా నీరు అందించాలనే సదుద్దేశ్యంతో ఇప్పటికే వాటర్ పైపులైన్ పనులు పూర్తిచేశారు. అయితే వాటర్ ట్యాంక్ నిర్మించేందుకు అవసరమైన ప్రభుత్వ స్థలం అందుబాటులో లేకపోవడంతో కార్పొరేటర్ బీ జానారెడ్డి, ఎమ్మెల్యే మల్లాది విష్ణు స్థానికులు, అధికారులతో మాట్లాడి ప్రైవేటు స్థలానికి బాండ్లు ఇప్పించి వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ప్రస్తుతం వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అలాగే రూ. 22 కోట్లతో డివిజన్‌లోని అన్ని రోడ్లు నిర్మించారు. ఎంతో కాలంగా పరిష్కారం కాకుండా ఉన్న రామకృష్ణాపురం దేవీనగర్ యూజీడీ లీకేజీ సమస్యలను సైతం కొత్తపైపులైన్ వేసి శాశ్వతంగా పరిష్కరించారు.



జీవీఆర్‌నగర్‌లో నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్



జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్యకాలనీ మెయిన్ రోడ్డు



ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్

రూ. 3.8 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్..

ఇక్కడ పెరుగుతున్న జనాభా, లోవోల్టేజీ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రూ. 3.8 కోట్లతో ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యలు పరిష్కరించారు. అత్యాధునిక పరిజ్ఞానంతో నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తూ వినియోగదారుల మన్ననలు అందుకుంటున్నారు. ప్రతీ చిన్న ప్రాంతాన్ని ఫీడర్‌గా చేసి విద్యుత్ సమస్యలు వచ్చినప్పుడు ఆ ప్రాంతం వరకు మాత్రమే విద్యుత్ సరఫరాను నిలిపి మరమ్మత్తులు చేస్తున్నారు.

పాలకులు, అధికారులకు కృతజ్ఞతలు



ఒక పక్క సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే అభివృద్ధి పనులు పూర్తిచేయడం ఆనందంగా ఉంది. మా ప్రాంతానికి కృష్ణా వాటర్ వస్తుందంటేనే సంతోషంగా ఉంది. అలాగే ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న రోడ్డు పనులు పూర్తిచేసిన అధికారులు, పాలకులకు కృతజ్ఞతలు.

–నాగిరెడ్డి శేషావణిరెడ్డి, లచన్ ఇన్‌ఫ్రా అపార్ట్‌మెంట్ సెక్రటరీ

విద్యుత్ సమస్యలు తీరాయి



కోవిడ్ మహమ్మారితో రెండేళ్లు నష్టపోయినప్పటికీ అభివృద్ధి పనులు పూర్తిచేయడం అభినందనీయం. ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించడం ద్వారా విద్యుత్ సమస్యలను పరిష్కరించారు. ప్రస్తుతం నాణ్యమైన విద్యుత్ సరఫరాతో పాటు రోడ్లు సుందరంగా తీర్చిదిద్దారు.

– ఎస్‌కే అక్బర్, దావు బుచ్చయ్య కాలనీ

మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారు



ఒకప్పుడు చిన్నపాటి వైద్యసేవలు కావాలన్నా మధురానగర్, అజిత్ సింగ్‌నగర్ తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు డివిజన్‌లో కోట్లాది రూపాయలతో అన్ని వసతులతో పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించి మెరుగైన వైద్యసేవలు అందించడం సంతోషంగా ఉంది. అన్ని రకాల పరీక్షలు ఉచితంగా చేయడంతో ఆరోగ్యానికి భరోసా లభించింది.

– రఫీవుల్లాఖాన్, గద్దే వెంకట్రామయ్య నగర్

సార్వత్రిక ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

మధురానగర్(విజయవాడసెంట్రల్): సార్వత్రిక ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలు సిద్ధం అయ్యాయి. పోలింగ్‌ను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. మధురానగర్ వీఎంసీ కల్యాణ మండపం, గద్దే వెంకట్రామయ్య నగర్ నూలు మిల్లు, ముత్యాలంపాడు గొట్టిముక్కల సూర్య నారాయణరాజు నగరపాలక సంస్థ పాఠశాల, అయోధ్యనగర్ శ్రీ సూర్య పబ్లిక్ స్కూల్, మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాల తదితర ప్రాంతాల్లోని పోలింగ్ బూత్‌ల వద్ద షామియానాలు వేసి ఓటు వేసేవారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకున్నారు. ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్‌ను నిర్వహించనున్నట్లు పోలింగ్ అధికారులు తెలిపారు.



మధురానగర్ వీఎంసీ కల్యాణ మండపంలో పోలింగ్ బూత్

అలాగే పోలింగ్ బూత్‌ల వద్ద 100 మీటర్‌లు, 200 మీటర్‌ల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. దివ్యాంగులు, వృద్ధులు ఓటు వేసేందుకు తగు చర్యలు తీసుకున్నామని అధికారులు తెలిపారు.

సనాతన వైదిక ధర్మరక్షకుడు జగద్గురువు ఆదిశంకరులు

విజయవాడకల్చరల్: సనాతన వైదిక ధర్మరక్షకుడు జగద్గురు ఆదిశంకరులని ఆధ్యాత్మికవేత్త శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి అన్నారు. శృంగేరీ శారదాపీఠం (శివరామ కృష్ణ క్షేత్రంలో) 20 రోజులుగా నిర్వహిస్తున్న జగద్గురు ఆదిశంకరాచార్య జయంతి ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. ఆదివారం నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి జగద్గురువులు రచించిన ప్రస్థాన త్రయం అంశంగా ప్రసంగించారు. బ్రహ్మసూత్రములు, శ్రీమదు భగవద్గీత, ఉపనిషత్తులను మూడింటినీ ప్రస్థాన త్రయంగా పిలుస్తారని వివరించారు. శంకరులు భారతీయ ఉపఖండంలో పర్యటించి శంక తత్వాని ప్రచారం చేశారని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా సంగీత విద్వాంసులు గౌరీనాథ్, గాయత్రి గౌరీనాథ్, మాధవీలు ఆదిశంకరులు రచించిన శ్లోకాలను గానం చేశారు. దేవాలయంలో ప్రత్యేకంగా నిర్మించిన వేదికమీద ఆదిశంకరుల విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో శివరామకృష్ణ క్షేత్రం ధర్మాధికారి శిష్టా ల హనుమత్ ప్రసాద్ పాల్గొన్నారు.



జగద్గురు ఆదిశంకరులకు పూజలు నిర్వహిస్తున్న అర్చక స్వాములు



ఆదిశంకరుల శ్లోకాలను గానం చేస్తున్న గౌరీనాథ్, గాయత్రిగౌరీనాథ్

యోగతో శారీరక, మానసిక ఆరోగ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): క్రమం తప్పకుండా యోగ సాధన చేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని యోగ ఇన్‌స్ట్రక్టర్ ప్రభాకర్ అన్నారు. ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఆదివారం స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత యోగ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక విశ్వ గురువు, సైంటిఫిక్ సెయింట్, పూర్ణ గురువులు విశ్వ స్ఫూర్తి అనుగ్రహించిన 'ఆసన ప్రాణాయామ యోగ ప్రక్రియ' (ప్రస్థాన సాధన)లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి వారం శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని, ఇప్పటికి నాలుగు వారాలు పూర్తయిందని చెప్పారు. యోగను సాధన చేసి అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. హెచ్ఎస్‌బీసీ బ్యాంక్ చెన్నై బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ సుమన్ యోగ సాధన ద్వారా వారి జీవితం ఎలా మారిందో చక్కగా వివరించారు. ఛార్టర్డ్ అకౌంటెంట్ జయలక్ష్మి తన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. ఈ శిక్షణలో 33 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో స్ఫూర్తి కుటుంబం ఏపీ ట్రస్టీ చొప్పరపు నారాయణరావు, గ్రంథాలయ అధికారిణి కె.రమాదేవి, గుణశేఖర్ స్ఫూర్తి కుటుంబ వలంటీర్లు పాల్గొన్నారు.



ఠాగూర్ గ్రంథాలయంలో యోగాసనాలు సాధన చేస్తున్న విద్యార్థులు

ఓటర్లకు డబ్బు పంచుతూ పట్టుబడ్డ బొండా అనుచరుడు

రూ. 66 వేలు నగదు పట్టివేత

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తూ టీడీపీ నేతలు అడ్డదారులు తొక్కుతూనే ఉన్నారు. ఇటీవల సామాజిక వర్గాల వారీగా కుక్కర్లు, ఇస్త్రీ పెట్టెలు, రజకులకు షాప్ కిట్లు పంపిణీ చేసిన టీడీపీ నేతలు ఇప్పుడు ఓటర్లకు డబ్బులు పంచిపెడుతూ పోలీసులకు దొరికిపోయారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిధిలోని అజిత్‌సింగ్‌నగర్ టీడీపీ కార్యాలయంలో ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తున్నట్లుగా పోలీసులకు సమాచారం రావడంతో ఆదివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఇంతలో కొంతమంది అక్కడి నుంచి పారిపోగా టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొండా ఉమా ప్రధాన అనుచరుడు గంటా కృష్ణమోహన్ ఓటర్లకు డబ్బులు పంచుతూ పట్టుబడ్డారు. అతని వద్ద తనిఖీలు చేయగా రూ. 66 వేలు లభించింది. దీంతో అతన్ని అదుపులోకి తీసుకుని సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.



టీడీపీ అభ్యర్థి బొండా ఉమా, చంద్రబాబుతో నిందితుడు గంటా కృష్ణమోహన్ (ఫైల్)

పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఎన్నికల సిబ్బంది

పాయకాపురం(విజయవాడరూరల్): సార్వత్రిక ఎన్నికలు సోమవారం జరుగనున్న నేపథ్యంలో పోలింగ్ సిబ్బంది ఈవీఎం మిషన్లతో ఆదివారం సాయంత్రం పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. 62వ డివిజన్ ఎల్‌బీఎస్ నగర్‌లోని పుచ్చలపల్లి సుందరయ్య మునిసిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది ప్రత్యేక వాహనంలో పోలీసు సెక్యూరిటీతో వచ్చారు. హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఐదు పోలింగ్ కేంద్రాలకుగాను ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఒక పోలింగ్ ఆఫీసర్, ఒక అసిస్టెంటు పోలింగ్ ఆఫీసర్‌తో పాటు నలుగురు చొప్పున విధుల నిర్వహణకు అవసరమైన సిబ్బంది వచ్చారు. అదేవిధంగా 61, 63, 64వ డివిజన్‌లలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది విచ్చేశారు.



పుచ్చలపల్లి సుందరయ్య హైస్కూల్ పోలింగ్ కేంద్రానికి చేరుకున్న పోలింగ్ సిబ్బంది

పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు



అధికారులను వివరాలు అడిగి తెలుసుకంటున్న కలెక్టర్ ఢిల్లీరావు తదితరులు



ఎస్ఎస్ఎం స్కూల్లో పోలింగ్ సిబ్బంది



సార్వత్రిక ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. ఆదివారం ఉదయం నుంచే ఆయా పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని తరలించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు పర్యవేక్షణలో అధికారులు ఈవీఎంలు, పోలింగ్ సామగ్రి తరలింపు, రవాణా సదుపాయాలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. పూర్తి స్థాయిలో సామగ్రితో ఎన్నికల సిబ్బంది తమకు కేటాయించిన కేంద్రాలకు ఏర్పాటుచేసిన ఆర్టీసీ బస్సుల్లో తరలివెళ్లారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



ఎన్నికల విధులకు వెళుతున్న ఉద్యోగులు



ఉక్కపోయటంతో చిన్నారులను కూలర్ వద్దకు తీసుకొచ్చిన సిబ్బంది



ఈవీఎం మిషన్‌లు